

సోమశిలలో 13.650 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 13.650 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 2,600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.67,940
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,101
3శాతం జీఎస్టీతో	రూ.6,304
నవర (8గ్రాములు)	రూ.50,432

గరిష్టం/కనిష్టం
34.5 /26.0

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 63 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. మంగళవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.



న్యూస్‌రీల్


పీఏ కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(టౌన్‌): కారులో వస్తూ రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ పీఏ వెంకటేశ్వర్లు మృతిచెందిన నేపథ్యంలో ఆయన సతీమణి లక్ష్మికి సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరులోని ఆయన కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ ఫండ్‌ కింద రూ.10 లక్షల చెక్కు అందజేశారు. ఇప్పటికే వైఎస్సార్‌ బీమా ద్వారా రూ.5 లక్షలు అందజేశారు. వీటితో పాటు మరింత సాయం అందించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్సీకి పీఏ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విజయసాయిరెడ్డి నేడు నెల్లూరుకు రాక



నెల్లూరు(సెంట్రల్‌): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంటు సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి మంగళవారం నెల్లూరుకు రానున్నట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆయన నెల్లూరులో అందుబాటులో ఉంటారని తెలిపారు.

16న సర్వేపల్లి ఉద్యాన నర్సరీలో బహిరంగ వేలం

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి వద్ద నున్న ఉద్యాన నర్సరీలో ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఉద్యానశాఖ మండల అధికారిణి వై.ప్రేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యాన నర్సరీలో ఉన్న 420 మామిడి చెట్లు, 20 సపోట చెట్లకు సంబంధించి ఫలసాయం హక్కుల కోసం ఈ వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల వారు రూ.500 చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 7995086940 ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఇంటర్‌ పరీక్షలకు 419 మంది గైర్హాజరు



నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు(టౌన్‌): ఇంటర్‌ ద్వితీయ సంవత్సర పరీక్షలకు సోమవారం జిల్లాలలో మొత్తం 419 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు జనరల్‌కు సంబంధించి 20,510 మందికి గాను 20,188 మంది హాజరయ్యారు. 322 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,244 మందికి గాను 1,147మంది హాజరయ్యారు. 97 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఆర్‌ఐఓ శ్రీనివాసులు 5 పరీక్ష కేంద్రాలను, డీవీఈఓ మధుబాబు 5 కేంద్రాలను, ఫ్లయింగ్‌ స్క్వాడ్, డీఈసీ కమిటీ 34 కేంద్రాలను తనిఖీ చేశారు. ఆర్‌ఐఓ శ్రీనివాసులు నగరంలోని నవాబుపేట పోలీస్‌స్టేషన్, తోటపల్లిగూడూరులోని శ్రీచైతన్య, ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల వద్ద పరీక్షల సిబ్బందికి సూచనలిచ్చారు.

డీసీపల్లిలో 280 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 280 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వేలానికి 294 బేళ్లు రాగా వాటిలో 280 బేళ్లను విక్రయించామని, గరిష్ట ధర రూ.230 లభించిందని తెలిపారు. వేలంలో 12 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

జువ్వలదిన్నె ‘సిద్ధం’

పూర్తయిన ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణం

- 1,250 బోట్లు నిలిపే సామర్థ్యంతో ఏర్పాటు
- ప్రత్యక్షంగా 6,100 మంది మత్స్యకారులకు ప్రయోజనం
- పరోక్షంగా మరో 10 వేల మందికి ఉపాధి
- అనుబంధ పరిశ్రమల ద్వారా మరింత మందికి జీవనోపాధి
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కావలి: అపార మత్స్యసంపదకు నిలయమైన ఆంధ్రా తీరాన్ని వేటకు అనుకూలంగా మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎగుమతులకు అవకాశం కల్పిస్తే మత్స్యకారుల వలసలను నివారించవచ్చని భావించింది. సాగర తీరాన్ని సుసంపన్నం చేసేలా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేలా కావలి నియోజకవర్గంలోని జువ్వలదిన్నెలో ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు 72 ఎకరాల విస్తీర్ణంలో రూ.288.80 కోట్ల వ్యయంతో ఈ ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఈ హార్బర్‌ను మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

65 మత్స్యకార గ్రామాల్లో వెలుగులు

కావలి నియోజకవర్గంలోని 35 కిలోమీటర్ల సముద్ర తీరంలో 65 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 58,000 మంది జనాభా ఉన్నారు. సముద్రం ఒడ్డునే నివసించే మత్స్యకార కుటుంబాలకు చేపల వేటే జీవనాధారం. తమిళనాడు రాష్ట్రం నుంచి పెద్ద బోట్లు వచ్చి ఈ ప్రాంతంలోని సముద్ర తీరంలో చేపలు వేట చేస్తూ, మత్స్య సంపదను కొల్లగొట్టడం అనాదిగా జరుగుతోంది. సముద్రంలో తమిళ బోట్లు చేస్తున్న దారుణాలను అరికట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇక్కడి మత్స్యకారులు ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం కూలీలుగా వెళ్తున్నారు. ఈ వలసల నివారణ, శాశ్వత ఉపాధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జువ్వలదిన్నెలో ఫిషింగ్‌ హార్బర్‌ను నిర్మించింది.

ఇకపై సిరులదిన్నె

ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణం ద్వారా ఇకపై జువ్వలదిన్నె సిరులదిన్నెగా మారనుంది. ఫిషింగ్‌ హార్బర్‌ ద్వారా ఏటా అదనంగా వేల టన్నుల మత్స్యసంపద లభించడంతోపాటు హార్బర్‌ ఆధారిత పరిశ్రమల ద్వారా మత్స్యకారులు అదనపు ఆదాయం పొందే మార్గాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. హార్బర్‌తోపాటు 20 ఎకరాల్లో ఫిష్‌ ప్రాసెసింగ్‌ యూనిట్, 5 ఎకరాల్లో బోట్ల తయారీ యూనిట్‌ను ఏపీ మారిటైం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తోంది. అలాగే మత్స్యకారులకు అదనపు ఆదాయం సమకూర్చేలా హార్బర్‌ వద్ద ఇంటిగ్రేటెడ్‌ ఫుడ్‌పార్క్‌ల నిర్మాణంపై కూడా ఏపీ మారిటైం కసరత్తు చేస్తోంది. కేవలం మత్స్యసంపద మాత్రమే కాకుండా ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కూడా ప్రాసెస్‌ చేసేలా పైలట్‌ ప్రాజెక్ట్‌ కింద జువ్వలదిన్నె హార్బర్‌ వద్ద 50 ఎకరాల్లో ఫుడ్‌పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా కానున్నాయి. ప్రధానంగా మత్స్యకార మహిళలకు, యువతకు స్థానికంగానే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటి వరకు సరైన వేట, ఉపాధి అవకాశాలు లేక కావలి నియోజకవర్గంలోని మత్స్యకారులు తమిళనాడు, పుదుచ్చేరి, ముంబై, గోవా తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం స్థానికంగానే మెరుగైన ఉపాధి అవకాశాలు లభించనుండడంతో వలసలకు పూర్తిగా అడ్డుకట్ట పడనుంది.

ఏటా అదనంగా 41,000 టన్నుల మత్స్యసంపద

జువ్వలదిన్నెలో నిర్మించిన ఫిషింగ్‌ హార్బర్‌ ద్వారా ఇకపై ఏటా 41,000 టన్నుల మత్స్యసంపద అదనంగా లభించనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు తీరంలో పెద్ద బోట్లు నిలిపే అవకాశం లేకపోవడంతో సముద్రంలో 25 నాటికన్‌ మైళ్లు దాటి వేట చేపట్టలేకపోయేవారు. ఇప్పుడు ఏకంగా 1,250 బోట్లు నిలిపే సామర్థ్యంతో ఫిషింగ్‌ హార్బర్‌ అందుబాటులోకి రానుండడంతో పెద్దబోట్ల సాయంతో వేట సాగించే అవకాశం లభించింది.

జువ్వలదిన్నె ఫిషింగ్‌ హార్బర్‌



మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేలా జిల్లాలోని జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తి చేసింది. తద్వారా మత్స్యకారుల వలసల నివారణ జరిగి వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అలాగే అనుబంధ పరిశ్రమల్లోనూ వేలాది మందికి ఉపాధి లభించి వారి జీవన ప్రమాణాలు పెంపొందనున్నాయి.

ఇది కదా.. అభివృద్ధి



చేపలు విక్రయించే స్టాళ్లు

ఫిషింగ్‌ హార్బర్‌ ఏర్పాటు వివరాలు

ఎంత విస్తీర్ణంలో - **72** ఎకరాలు
నిర్మాణానికి వినియోగించిన నిధులు - రూ.**288.80** కోట్లు



సముద్రంలో కదలికలపై నిఘా కోసం మెరైన్‌ కమ్యూనికేషన్‌ సెంటర్‌ భవనం

తీరంలో పండగ వాతావరణం

జువ్వలదిన్నె ఫిషింగ్‌ హార్బర్‌ ప్రారంభోత్సవ నేపథ్యంలో తీరంలో పండగ వాతావరణం నెలకొంది. వాస్తవానికి జువ్వలదిన్నె వద్ద హార్బర్‌ అనే విషయం మత్స్యకారులు కలలో కూడా ఊహించలేదు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా మత్స్యకారుల కష్టాలను స్వయంగా చూసిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తీరంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. 2021 మార్చి 19వ తేదీన జువ్వలదిన్నె హార్బర్‌ పనులు ప్రారంభించి త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయడం, అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, తీరప్రాంత గ్రామాల్లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి మత్స్యకారుల సిరుల పంటగా మారుతోంది.

ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద నిర్మించిన ఫిషింగ్‌ హార్బర్‌ను సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించనున్న నేపథ్యంలో స్థానికంగా కూడా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్‌ ఎం.హరినారాయణన్, జేసీ సేతు మాధవన్‌ పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితోపాటు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు. కాగా హార్బర్‌ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మత్స్యకార గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.



ప్రారంభోత్సవ ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్‌ హరినారాయణన్‌

శాశ్వత పరిష్కారం చూపించాం



2014లో నేను తొలిసారి ఎమ్మెల్యే కాగానే మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా జువ్వలదిన్నెలో ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణం చేపట్టాలని అప్పటి టీడీపీ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఈ హార్బర్‌ నిర్మాణంపై సమగ్రంగా వివరించా. ఆయన ద్వారా జువ్వలదిన్నె ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌ పద్ధతిలో శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కావలి

మత్స్యకారుల కల నెరవేరింది



కావలి ప్రాంతంలో ఫిషింగ్‌ హార్బర్‌ లేనందున మత్స్యకారులకు ఉపాధి కరువై జీవన భృతి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. జువ్వలదిన్నె ఫిషింగ్‌ హార్బర్‌ నిర్మాణం పూర్తయి ప్రారంభిస్తున్న నేపథ్యంలో వారంతా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఫిషింగ్‌ హార్బర్‌ ద్వారా కూలీలంతా యజమానులుగా మారి వారి జీవన ప్రమాణాలు పెంపొందనున్నాయి. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– కొండూరు అనిల్‌బాబు, అఫ్కాఫ్‌ చైర్మన్‌

చరిత్రలో నిలిచిపోయిన ‘సిద్ధం’ సభ

- ఈ జన సునామీ పచ్చబ్యాచ్‌కు కనిపించదు
- గ్రాఫిక్స్‌ చేసే పేటెంట్‌ హక్కు చంద్రబాబుదే
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్‌): బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగిన ‘సిద్ధం’ సభ చరిత్రలో నిలిచిపోయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఒక సభకు ఇంత పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా ప్రజలు తరలిరావడం తన రాజకీయ జీవితంలో చూడలేదన్నారు. గత నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా ఉన్నారని, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డికి తాము అండగా ఉంటూ మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామనే స్పందన ప్రజల నుంచి వెల్లువెత్తిందని తెలిపారు. మేదరమెట్ల సిద్ధం సభకు విచ్చేసిన జన సునామీని రాష్ట్ర ప్రజలందరూ చూశారని, కానీ పచ్చబ్యాచ్‌కు, ఎల్లోమీడియాకు మాత్రం ఈ జనప్రభంజనం కనిపించదని ఎద్దేవా చేశారు. గ్రాఫిక్స్‌ అనేది చంద్రబాబుకు పేటెంట్‌ హక్కు లాంటిదని, గతంలో సినిమా వాళ్లతో అమరావతి గ్రాఫిక్స్‌ చేయించిన ఘనత ఆయనదేనని విమర్శించారు. ప్రజలు స్వచ్ఛందంగా సిద్ధం సభకు తరలిరావడం గ్రాఫిక్సా చెప్పాలంటూ చంద్రబాబు అండ్‌ కో ను మంత్రి ప్రశ్నించారు.

చంద్రబాబు పంచన పవన్‌కళ్యాణ్‌

గతంలో తన తల్లిని దూషించిన వారి కాలర్‌ పట్టుకుంటానని బీరాలు పలికిన పవన్‌కళ్యాణ్‌ ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్‌ కాళ్లపట్టుకుని వారి పంచన చేరారని, వీళ్లద్దరూ చాలదన్నట్లు మరొక పార్టీ మద్దతు కూడా కూడగట్టుకుని ఎన్నికలకు వస్తున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. గతంలో ప్రధాని మోదీపై చంద్రబాబు ఎలాంటి విమర్శలు చేశారో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. చంద్రబాబు తన అజెండా మార్చినంత మాత్రాన ప్రజలు మారుతారా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా నిలుస్తూ వారి వెంటే నడుస్తున్నారని, కానీ చంద్రబాబు మాత్రం పొత్తులను నమ్ముకుని ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించి మళ్లీ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

చందాలు ఇవ్వలేదని పగపట్టిన సోమిరెడ్డి

పొదలకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి చందాలు ఇవ్వనందునే వారిపై పగబట్టి లేనిపోని అభాండాలు వేస్తున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అమ్మవారిపాళెం గ్రామంలో మంత్రి మాట్లాడుతూ సర్వేపల్లిలో ఎందరో ఉద్దండులైన నాయకులను చూశామని, అతని లాంటి నీచ రాజకీయాలు చేసే వ్యక్తిని చూడలేదని అన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ సభల సందర్భంగా పోర్టు యాజమాన్యం చందాలు ఇవ్వలేదనే అక్కసుతో సోమిరెడ్డి వారిపై ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సిద్ధం సభ సందర్భంగా పోలీసులు లేని సమయంలో సోమిరెడ్డి పోర్టు వద్దకు వెళ్లి సిబ్బందిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు.

గవర్నర్‌ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, మున్సిపల్‌ కమిషనర్‌

నెల్లూరు(దర్గామిట్ట): ఎస్‌ఏఎస్‌ఏడీసీ లబ్ధిదారులతో ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 13న వర్చువల్‌గా సంభాషించే కార్యక్రమానికి గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌ ముఖ్యఅతిథిగా నెల్లూరుకు రానున్నందున కస్తూర్బా కళాక్షేత్రంలో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో చేస్తున్న ఏర్పాట్లను సోమవారం మున్సిపల్‌ కమిషనర్‌ వికాస్‌మర్మత్‌తో కలిసి కలెక్టర్‌ పరిశీలించారు. సఫాయి కర్మచారి లబ్ధిదారులకు పీపీఈ కిట్లు, ఆయుష్మాన్‌ కార్డుల పంపిణీ, గవర్నర్‌ పర్యటన, ప్రొటోకాల్‌ ఏర్పాట్లపై మున్సిపల్‌ కమిషనర్‌ వికాస్‌మర్మత్‌కు, ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ రమేష్‌కు కలెక్టర్‌ పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.

నింగిలో కనిపించిన ‘నెలవంక’

- పవిత్ర రంజాన్‌ మాసం ఆరంభం
- సంబరాలు చేసుకున్న ముస్లింలు



జెండావీధి కూడలిలో సంబరాలు జరుపుకుంటున్న ముస్లిం యువత, చిన్నారులు

నెల్లూరు(బృందావనం): వినీలాకాశంలో సోమవారం సాయంత్రం ‘నెలవంక’ దర్శనమిచ్చిందని ముస్లిం మత పెద్దలు ప్రకటించడంతో పవిత్ర రంజాన్‌ మాసం ప్రారంభమైంది. ఉపవాస దీక్షలతో పవిత్ర రంజాన్‌మాసంలో వేడుకలు జరుపుకునేందుకు ముస్లింలు సమాయత్తమయ్యారు. రంజాన్‌ నెల ఆరంభం కావడంతో నెలవంకను వీక్షించిన అనంతరం ముస్లింలు మతపెద్దల సూచనలతో రాత్రి 8.45 గంటలకు తరావీ నమాజు ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ‘దువా’ (ప్రార్థన) చేశారు. నెలవంక కనిపించిందని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్‌ అవతరించి అల్లాహ్‌ సందేశమిచ్చిన మాసాన్ని రంజాన్‌మాసంగా ముస్లింలు భావిస్తారు. రంజాన్‌ మాసంలో నెల రోజులపాటు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. ప్రతి రోజూ వేకువజామున ‘సహర్‌’తో ఉపవాసం ఆరంభించి సాయంత్రం ‘ఇఫ్తార్‌’తో ఉపవాస దీక్ష విరమిస్తారు.

అంతర్‌ జిల్లాల కబడ్డీ పోటీల విజేత నెల్లూరు



విజేతగా నిలిచిన నెల్లూరు జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కోవూరు: స్థానిక వైకేఆర్‌అండ్‌కే డిగ్రీ కళాశాలలోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్‌ జిల్లాల పురుషుల కబడ్డీ పోటీలు ఆదివారం అర్ధరాత్రి ముగిశాయి. ఫైనల్స్‌లో నెల్లూరు – విజయనగరం జట్లు తలపడగా.. నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది. విజయనగరం జట్టు రెండో స్థానంలో, చిత్తూరు జట్టు మూడో స్థానంలో, కృష్ణా జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ పోటీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు, మాజీ క్రీడాకారులు విచ్చేశారు. విజేతలకు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్‌ కార్యదర్శి పద్మజాబాల, మాజీ కార్యదర్శి వీర్ల అంకయ్య, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్‌ మాజీ జాయింట్‌ సెక్రటరీ రాంబాబు, అడ్వైజర్‌ కేపీ రావు, రెఫరీ బోర్డు చైర్మన్‌ కృష్ణమూర్తి, హైటెక్‌ జిమ్‌ అధినేత ప్రసాద్‌ వెండి షీల్డ్‌లు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ ఆర్గనైజింగ్‌ కార్యదర్శి లవకుమార్, ఉపాధ్యక్షుడు డేవిడ్‌ జాన్సన్, అసోసియేషన్‌ కార్యదర్శి జె.విజయానందం తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్‌ లోపంపై సర్వే



నెల్లూరు(అర్బన్‌): జిల్లాలో అయోడిన్‌ లోపంతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. నగరంలోని వెంగళరావునగర్‌ మున్సిపల్‌ పాఠశాలలో సోమవారం డీఎంహెచ్‌ఓ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు సంబంధించి మూత్రం, ఇంట్లో వాడే ఉప్పును సేకరించి పరీక్షలు చేస్తున్నామన్నారు. అయోడిన్‌ లోపం ఉంటే పిల్లల్లో బుద్ధిమాంద్యం వచ్చే ప్రమాదం ఉందన్నారు. అలాంటి వారిని గుర్తించి తగిన చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ సుధీర్‌కుమార్, డాక్టర్‌ దివ్య, రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించండి

- సీసీఎఫ్‌ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(అర్బన్‌): వేసవిని దృష్టిలో ఉంచుకుని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గుంటూరు సీసీఎఫ్‌ శ్రీనివాసులురెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరుకు వచ్చిన ఆయన వేదాయపాళెంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో అధికారులు, రేంజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీ ప్రాంతంలో నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడవుల్లో మంటలు చెలరేగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో సమీప గ్రామ ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. కొత్తూరు వద్ద ఉన్న నగర వనాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలన్నారు. మార్చి నెలాఖరుకు జామాయిల్‌ కాంట్రాక్ట్‌ ముగుస్తుందని, కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించేందుకు జిల్లా డీఎఫ్‌ఓ, ఒంగోలు డీఎఫ్‌ఓ, గుంటూరు స్క్వాడ్‌ డీఎఫ్‌ఓ తదితరులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఒంగోలు డీఎఫ్‌ఓ శ్రీనివాసులు, స్క్వాడ్‌ డీఎఫ్‌ఓ మారుతీప్రసాద్, రేంజర్లు మాల్యాద్రి, రవీంద్రబాబు, శేఖర్, ఉమామహేశ్వరరెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

సొసైటీల బలోపేతానికి చర్యలు

కోవూరు: సహకార సంఘం సొసైటీలను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కావలి డిప్యూటీ రిజిస్ట్రార్‌. కె.యలమంద రావు తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార పరపతి సంఘాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీల ఆధ్వర్యంలో జనరిక్‌ మందుల షాపులు, కామన్‌ సర్వీస్‌ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల నిర్మాణం చేపట్టిన గోదాములను సివిల్‌ సప్లైస్‌ శాఖకు లేదా, ఎఫ్‌సీఐకు అద్దెకు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రస్తుతం సొసైటీల్లో కంప్యూటరీకరణ కార్యక్రమం జరుగుతోందని, దీనిని మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పడుగుపాడు సొసైటీ రైతులకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. బంగారు ఆభరణాలపై ఇప్పటి వరకు రూ.5 కోట్లకు పైగా రుణాలు అందించారన్నారు. పైలట్‌ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ఈ సొసైటీకి త్వరలో కంప్యూటర్లు రానున్నాయన్నారు. లాకర్‌ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు సుభాషిణి, కేవీ రమణయ్య, నిర్మల, రమేష్‌, సుబ్రహ్మణ్యం, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యలమంద రావు

నిర్ణీత గడువులోగా సమస్యల పరిష్కారం

- కలెక్టర్‌ హరినారాయణన్‌

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాంలో (స్పందన)లో వచ్చే సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌ ఆదేశించారు. నెల్లూరు కలెక్టర్‌ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. హరినారాయణన్‌, జాయింట్‌ కలెక్టర్‌ సేతు మాధవన్‌, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మిత, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా రిజిస్ట్రార్‌ బాలాంజనేయులు, ల్యాండ్‌ అండ్‌ సర్వే అధికారి హనుమాన్‌ ప్రసాద్‌, మెప్మా పీడీ రవీంద్ర, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ సిద్దా నాయక్‌, డీసీహెచ్‌ఎస్‌ రమేష్‌నాథ్‌, ఐసీడీఎస్‌ పీడీ హేనాసుజన్‌, హౌసింగ్‌ పీడీ నాగరాజు, బీసీ వెల్ఫేర్‌ అధికారి వెంకటయ్య పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్‌

పోలీస్‌ స్పందనకు 85 వినతులు

నెల్లూరు(క్రైమ్‌): నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. 85 మంది వివిధ సమస్యలపై వినతులను ఏఎస్పీ సీహెచ్‌ సౌజన్య, నగర, దిశ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, టి.సాయినాథ్‌కు అందజేశారు. దీంతో అధికారులు ఆయా ప్రాంత పోలీసు సిబ్బందితో మాట్లాడి నిర్ణీత గడువులోగా చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగాలు, ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌, చిట్స్‌ పేరిట మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కొందరు అనధికార చిట్స్‌ నిర్వహిస్తూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున నగదు వసూలు చేసి కుటుంబంతో సహా ఉడాయిస్తున్నారన్నారు. ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌ మోసాలపై సైబర్‌క్రైమ్‌.జీఓవీ.ఇన్‌తోపాటు టోల్‌ఫ్రీ నంబర్‌ 1930కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఫిర్యాదుదారులకు భోజనాలు అందజేశారు.


బాధితుల సమస్యలు వింటున్న ఏఎస్పీ సౌజన్య

అడవుల్లో పరిశోధనకు అనుమతి

కందుకూరు రూరల్‌: కందుకూరు టీఆర్‌ఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగంలో పని చేస్తున్న డాక్టర్‌ ఎస్‌.తిరుపతిస్వామికి ఆంధ్రప్రదేశ్‌ ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్స్‌ అండ్‌ వైల్డ్‌ లైఫ్‌ వారి నుంచి తూర్పు కనుమలలోని నల్లమల, శేషాచల అడవులను సందర్శించి అక్కడ ఉన్న వృక్ష సంపద, జీవ వైవిధ్యాన్ని అధ్యయనం చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు ప్రిన్సిపల్‌ ఎం.రవికుమార్‌ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. కడప, వెంకటగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న వృక్ష శాస్త్ర అధ్యాపకుల బృందానికి తిరుపతిస్వామి సారథ్యం వహిస్తారు. ఈ అనుమతులు ఈ ఏడాది మార్చి నుంచి 2025 ఫిబ్రవరి వరకు ఇచ్చారు. ఇటీవలే ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వారు కళాశాలకు ఇతర మూడు విభాగాలతోపాటు వృక్షశాస్త్ర విభాగానికి కూడా పరిశోధన కేంద్రాన్ని కేటాయించారు. తిరుపతిస్వామికి రీసెర్చ్‌ గైడ్‌షిప్‌ను మంజూరు చేశారు.


ఎస్‌.తిరుపతిస్వామి

బైక్‌ను ఢీకొన్న కారు

- భర్త మృతి, భార్యకు గాయాలు

కొడవలూరు: మోటార్‌బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న భర్త మృతిచెందగా, భార్య స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని రాచర్లపాడు వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలి పురపాలక సంఘంలో చెత్త తరలించే ట్రక్కు డ్రైవర్‌ అయిన సిద్ధం పెంచల ప్రసాద్‌ (52) తన భార్యతో కలిసి బైక్‌పై సంగం వెళ్లాడు. తిరిగి కావలికి బయలుదేరారు. ఈ క్రమంలో రాచర్లపాడు వద్ద వెనుక నుంచి అతి వేగంగా కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పెంచలప్రసాద్‌ తీవ్రంగా, ఆయన భార్య స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని కావలి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందారు. ఈ మేరకు ఎస్సై కె.వీరప్రతాప్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జలదంకి: మండలంలోని అన్నవరం క్వారీ సమీపంలోని పంట పొలాల్లో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. జలదంకి పోలీసుల కథనం మేరకు.. అన్నవరం గ్రామానికి చెందిన కొమరం మల్లికార్జున (49) వ్యవసాయం చేస్తుంటాడు. కల్లు విక్రయించేవాడు. అతడికి భార్య పార్వతి, ఒక కొడుకు ఉన్నారు. ఇతను కావలిలో పదో తరగతి చదువుతున్నాడు. కాగా ఏడు సంవత్సరాల క్రితం ఓ కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. మూడు రోజుల నుంచి మల్లికార్జున పూటుగా మద్యం తాగుతున్నాడు. ఏమైందో కానీ సోమవారం ఉదయం అన్నవరం క్వారీ సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి జలదంకి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు.


మల్లికార్జున మృతదేహం

ఇస్కాన్‌ సిటీలో భారీ చోరీ

నెల్లూరు(క్రైమ్‌): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. ఇస్కాన్‌ సిటీలో రాజతిమ్మారెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన ఈనెల 8వ తేదీన తన కుటుంబంతో కలిసి అరుణాచలం వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి రూ.12 లక్షల నగదు, 46 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించారు. 9వ తేదీన బాధితులు ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగిందని గుర్తించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు దర్గామిట్ట పోలీసులు తెలిపారు.

పేలుడు పదార్థం కొరికి కుక్క మృతి

ఉదయగిరి: పట్టణంలోని ఆనకట్ట సమీపంలో కంపచెట్ల వద్ద పేలుడు పదార్థాన్ని కొరికి కుక్క మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఉదయం ఆనకట్టపై జనం వాకింగ్‌ చేస్తున్నారు. సమీపంలోకి అడవి జంతువులు వస్తుండడంతో వాటి బెడద తప్పించుకునేందుకు గుర్తు తెలియని వ్యక్తులు పొలాల వద్ద పేలుడు పదార్థం పెట్టారు. అటుగా వెళ్లిన కుక్క దానిని గట్టిగా కొరకడంతో పెద్ద శబ్దంతో పేలింది. దీంతో కుక్క అక్కడికక్కడే మృతిచెందింది. ఈ శబ్దానికి వాకర్స్‌ పరుగులు తీశారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్‌): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి, ఇంటర్‌ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 12 కేజీబీవీలు ఉన్నాయన్నారు. ఒక్కో దానిలో 6వ తరగతిలో 40 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌కు సంబంధించి 40 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు. అదే విధంగా 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లు కోసం ఈనెల 12 నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి మెసేజ్‌ పంపుతామన్నారు. వివరాలకు 99088 37107, 93903 95563 ఫోన్‌ నంబర్లను సంప్రదించాలన్నారు.


రాంగ్‌ రూట్‌లో వచ్చి..

- ట్రాక్టర్‌ ఢీకొని యువకుడి మృతి


ఘటనా స్థలంలో సాయితేజ మృతదేహం

ఉలవపాడు: మోటార్‌బైక్‌పై వెళ్తున్న యువకుడిని ట్రాక్టర్‌ రాంగ్‌ రూట్‌లో వచ్చి ఢీకొంది. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వీరేపల్లి – చాగల్లు మధ్య జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మార్టూరు మండలం కె.రాజుపాలేనికి చెందిన నువ్వల సాయితేజ (24) బైక్‌పై స్వగ్రామం నుంచి బెంగళూరుకు వెళ్తున్నాడు. చాగల్లు దాటిన తర్వాత రాంగ్‌ రూట్‌లో వాటర్‌ ట్యాంకర్‌తో ట్రాక్టర్‌ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయితేజ రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్‌ డ్రైవర్‌ పరారయ్యాడు. మృతుడి కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. రోడ్‌ సేఫ్టీ పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎస్సై బాజిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.85
సన్నవి	రూ.75
పండ్లు	రూ.30

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌ (లైవ్‌)	127
లేయర్‌ (లైవ్‌)	73
బ్రాయిలర్‌ చికెన్‌	224
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	250
లేయర్‌ చికెన్‌	125